## క్లుప్తంగా

### ఆచరణ సాధ్యంకాని హామీలతో టీడీపీ మేనిఫెస్టో


పుప్పాల వాసుబాబు

గణపవరం: ప్రస్తుత ఎన్నికల్లో అధికారం కోసం చంద్రబాబు ఆచరణ సాధ్యం కాని హామీలతో రూపొందించిన మేనిఫెస్టోను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు జోస్యం చెప్పారు. మంగళవారం సాయంత్రం ఆయన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మంగళవారం చంద్రబాబు, పవన్ విడుదలచేసిన ఎన్నికల మేనిఫెస్టో పెద్ద మాయ అన్నారు. ఈ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయాలంటే ఏడాదికి సుమారు రూ.14 లక్షల కోట్లు అవసరమని ఆర్థిక నిపుణులు చెబుతున్నారని, మన రాష్ట్ర వార్షిక ఆదాయం రూ.2లక్షల కోట్లు ఉందని, ఈ పరిస్థితుల్లో ఇచ్చిన హామీల్లో నాలుగో వంతు కూడా అమలు చేయడం చంద్రబాబుకు సాధ్యం కాదన్నారు. బీజేపీ ఈ మేనిఫెస్టోకు దూరంగా ఉందని, కనీసం వారి మద్దతు కూడా లేదన్నారు. ఈ పరిస్థితుల్లో మేనిఫెస్టో బూటకంగా అర్థమవుతుందన్నారు. జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాలతో రాష్ట్రాన్ని మరో శ్రీలంక చేస్తున్నారని, ప్రజలను సోమరిపోతులను చేస్తున్నారని తీవ్రంగా విమర్శించిన చంద్రబాబు ఇప్పుడు అనేక పథకాలను ప్రకటించడం కేవలం అధికారం దక్కించుకోవడానికే తప్ప ప్రజల కోసం కాదని స్పష్టమవుతుందని వాసుబాబు అన్నారు.

### నేడు అబ్బయ్యచౌదరి ఎన్నికల ప్రచారం

పెదపాడు: మండలంలో పలు గ్రామాల్లో బుధవారం ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు తెలిపారు. బుధవారం ఉదయం 7 గంటల నుంచి గోగుంట, వసంతవాడ, రాజుపేట, తోటగూడెం, పునుకొల్లులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని పేర్కొన్నారు. అనంతరం మధ్యాహ్నం 5.30 గంటల నుంచి ఏపూరులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని తెలిపారు. ఈ ప్రచార కార్యక్రమంలో పెదపాడు మండలంలోని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

### ఎన్నికల ప్రవర్తనా నియమావళి పాటించాలి


పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న పరిశీలకులు కృష్ణకాంత్‌పాఠక్, ఆర్వో ఖాజావలి

ఉంగుటూరు: స్వేచ్ఛగా పారదర్శకంగా ఎన్నికల ప్రక్రియను పూర్తిచేసేందుకు పార్టీల అభ్యర్థులు సహకరించాలని ఎన్నికల సాధారణ పరిశీలకులు డాక్టర్ కృష్ణకాంత్‌పాఠక్ కోరారు. మంగళవారం తహసీల్దారు కార్యాలయంలో ఎన్నికల ప్రక్రియ, నియమ నిబంధనలపై రాజకీయ పార్టీ నాయకులకు సమావేశం నిర్వహించారు. ఉంగుటూరు రిటర్నింగు అధికారి ఖాజావలి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో పాఠక్ మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఎవరు ఉల్లంఘించినా చట్ట ప్రకారం చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఫిర్యాదులను ఆర్వోలకు లేదా 915690377 ఫోన్ నంబరుకు తెలియజేయవచ్చని తెలిపారు. అభ్యర్థుల సందేహాలకు సమాధానం ఇచ్చారు. పోటీచేసే అభ్యర్థులు ఎన్నికల ఖర్చును తప్పని సరిగా చూపించాలని పాఠక్ స్పష్టం చేశారు.

**పోలింగు కేంద్రాన్ని పరిశీలించిన అధికారులు**

ఉంగుటూరులోని ఓ పోలింగు కేంద్రాన్ని కృష్ణకాంత్‌పాఠక్ మంగళవారం పరిశీలించారు. ఓటర్లకు ఏవిధమైన అసౌకర్యం లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు ఆయన సూచించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగు అధికారి ఖాజావలి తదితరులు పాల్గొన్నారు.

### స్నేహం కోసం లండన్ నుంచి రాక


అబ్బయ్యచౌదరి కోసం లండన్ నుంచి వచ్చిన మిత్రుడు ఎన్ఆర్ఐ ముప్పిడి సుశీల్‌కుమార్

దెందులూరు: స్నేహం కోసం లండన్ నుంచి ఎండల్లోకి వచ్చి తన మిత్రుడిపై ఉన్న ప్రేమను ఎన్ఆర్ఐ ముప్పిడి సుశీల్‌కుమార్ చాటుకున్నారు. దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, ఎన్ఆర్ఐ ముప్పిడి సుశీల్‌కుమార్ లండన్‌లో మిత్రులు. రెండవసారి ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న అబ్బయ్యచౌదరికి తన సంఘీభావం ప్రకటించాలి, ప్రచారంలో కలవాలని, చూడాలనే తపనతో ఆయన లండన్ నుంచి దెందులూరు నియోజకవర్గం పెదయాగనమిల్లి, కలకుర్రు గ్రామాలకు వచ్చారు. మంగళవారం ప్రచారంలో ఉన్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరిని సుశీల్‌కుమార్ కలిశారు. దీంతో అబ్బయ్యచౌదరి సంతోషంతో ఉబ్బితబ్బి అయ్యారు. ఒకరికొకరు ఆలింగనం చేసుకున్నారు. ఎన్ఆర్ఐ సుశీల్‌కుమార్ మాట్లాడుతూ ఎన్నికలు పూర్తయ్యే వరకు అబ్బయ్యచౌదరితోనే ఉంటానని తెలిపారు.

# జగనన్న విద్యా కానుక.. చిన్నారుల చదువుకు భరోసా

- ఏటా బడి తెరిచే రోజునే విద్యాకానుక కిట్ల పంపిణీ
- 2024-25 విద్యాసంవత్సరంలో 18,729 విద్యార్థులకు లబ్ధి
- మూడు జతల ఆకర్షణీయమైన యూనిఫాం
- ఖరీదైన బ్యాగులు, బూట్లు, నోట్‌బుక్స్, వర్క్‌బుక్స్, పాఠ్యపుస్తకాలు ఉచితం


జగనన్న విద్యాకానుక కిట్ ప్రదర్శన


ఆకర్షణీయమైన యూనిఫారంలో విద్యార్థులు


మండల స్టాక్ పాయింట్ చేరుతున్న పాఠ్యపుస్తకాలు

నిడమర్రు: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాలుగేళ్లుగా అందిస్తున్న జగనన్న విద్యాకానుక (జేవీకే) పేద విద్యార్థుల్లో మరింత ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించి చదువుల్లో మరింత రాణించేలా ప్రభుత్వం ప్రోత్సహించిందంటూ వారి తల్లిదండ్రులు చెపుతున్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల పట్ల ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందనడానికి ఈ జేవీకే కిట్స్ అందించడం కూడా ఒక కారణమని విద్యావేత్తలు చెపుతున్నారు. ఏటా పేద విద్యార్థులకు అందించే జగనన్న విద్యాకానుక కిట్లను మరింత నాణ్యత ప్రమాణాలతో అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఏటా ఉంగుటూరు నియోజకవర్గంలో రూ.18 వేల నుంచి రూ.19 వేల మందికి ఈ జేవీకే కిట్లు పంపిణీ చేస్తున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 3 జతల ఆకర్షణీయమైన చెక్స్ యూనిఫాం, ఖరీదైన బ్యాగ్, బెల్ట్, ఆకర్షణీయమైన షూతోపాటు ఉచిత పాఠ్య, వర్క్ బుక్స్, నోట్స్ పుస్తకాలతో హుందాగా పాఠశాలకు వెళ్లే పరిస్థితి గత నాలుగేళ్లుగా కొనసాగుతున్నట్లు విద్యార్థుల తల్లిదండ్రులు చెపుతున్నారు.

**విద్యా సంవత్సరం ప్రారంభం రోజే జేవీకే కిట్లు**

ప్రతి విద్యాసంవత్సరం ప్రారంభరోజునే పాఠశాలకు వచ్చిన ప్రతి విద్యార్థికి ఈ కిట్స్‌లోని వస్తువులు అందించేలా ముందస్తు చేపడుతూనే ఉన్నారు. ఈ 2024-25 విద్యాసంవత్సరం జూన్ 12వ తేదీ నుంచి పాఠశాలలు పునః ప్రారంభం కానున్న నేపథ్యంలో అదే రోజే ప్రతి విద్యార్థి చేతుల్లో జగనన్న విద్యాకానుక (జేవీకే) కిట్లను అందించేలా ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. జూన్ 1 నుంచి మండల కేంద్రాల స్టాక్ పాయింట్ల వద్దకు ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలు, యూనిఫారం, బ్యాగులు, నోట్సులు, పాఠ్యపుస్తకాలు, బెల్టులు, బూట్లు ఒక్కొక్కటిగా చేరేలా ఏర్పాట్లు చేశారు. ఉంగుటూరు నియోజకవర్గంలో ఈ విద్యాసంవత్సరంలో 1 నుంచి 10వ తరగతి వరకూ చదువుతున్న 18,729 మంది విద్యార్థులకు జేవీకే కిట్లు అందించనున్నారు.

**కానుక వస్తువులు నాణ్యత పారదర్శకంగా**

జగనన్న విద్యాకానుక కిట్లలోని ప్రతి వస్తువు నాణ్యతను ఎవ్వరైనా తనిఖీ చేసుకునేలా ఎంఈవో కార్యాలయాల వద్ద ప్రత్యేకంగా జేవీకేలోని వస్తువులను ప్రదర్శన ఏర్పాటు చెయ్యడం పథకం పారదర్శకతను తెలుపుతోంది. దీనికోసం ప్రభుత్వం ప్రత్యేకమైన మిర్రర్‌తో కూడిన ఐరన్ సెల్ఫ్‌ను మండల కేంద్రాల వద్ద ఏర్పాటుచేసింది. ఈ సెల్ఫ్‌లో జేవీకేలో అందించే వాటిని నమూనాగా ప్రదర్శిస్తారు.

**ఉంగుటూరు నియోజకవర్గంలో..**

| మండలం | పంపిణీ చేసే జగనన్న కిట్లు |
|---|---|
| ఉంగుటూరు | 6,291 |
| భీమడోలు | 4,893 |
| గణపవరం | 4,462 |
| నిడమర్రు | 3,083 |

### ఇంగ్లీష్‌పై మరింత పట్టు సాధించాం



నాలుగేళ్లుగా మాకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న బైల్వాంగేజ్ పాఠ్యపుస్తకాల్లో ప్రతి పేజీలో ఇంగ్లీష్ మాధ్యమంతోపాటు పక్కనే తెలుగు మాధ్యమం ఉండటంతో ఇంగ్లీష్‌పై పట్టు సాధించగలిగాం. పరీక్షలు సైతం 6వ తరగతి నుంచి ఇంగ్లీషు మీడియంలోనే సులువుగా రాయగలిగాము. ఎన్ఎంఎంఎస్‌లో మంచి మార్కులు సాధించేందుకు ఈ పాఠ్యపుస్తకాలు ఎంతో ఉపయోగపడ్డాయి.

– మద్దాల సంధ్య, 8వ తరగతి, జల్లికొమ్మర

### పేద విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెరిగింది



ప్రభుత్వ పాఠశాలల్లో నిరు పేద విద్యార్థులే ఎక్కువ శాతం ఉంటారు. గత ప్రభుత్వంలో పాఠశాల ప్రారంభించిన రెండుమూడు నెలలైనా నోట్ పుస్తకాలు కొనుక్కునే పరిస్థితి ఉండేదికాదు. దీంతో తరగతి గదిలో వారు ఇబ్బందిపడేవారు. నేడు స్కూల్ ప్రారంభించే రోజునే నోట్స్‌లు, వర్క్‌బుక్స్, యూనిఫాం, షూ వంటి జేవీకే కిట్లు అందుకోవడం ద్వారా వారిలో ఆత్మవిశ్వాసం పెరిగింది.

– జనపరెడ్డి సత్యనారాయణ, చైర్మన్, పేరెంట్ కమిటీ

### జేవీకే కిట్లు మరింత నాణ్యతగా



జేవీకే కిట్లులో అందించే సామగ్రి నాణ్యత ప్రమాణాల్లోని లోపాలను ఏటా సవరిస్తూ మరింత నాణ్యతగా ఉండేలా ప్రభుత్వం కృషి చేస్తోంది. సూచించిన నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా లేకపోతే పాఠశాల నుంచి తిరిగి వెనక్కి పంపించే అధికారం విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రభుత్వం కల్పించింది. ఇప్పటివరకూ ఏ ప్రభుత్వం విద్యార్థులకు ఇచ్చే సామగ్రిపై ఇంత పారదర్శకతను ప్రదర్శించలేదు.

– పుప్పాల వాసుబాబు, ఎమ్మెల్యే, ఉంగుటూరు

# ప్రజాసంక్షేమమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టో


గుండుగొలనులో ఎన్నికల ప్రచారంలో కరపత్రాలను అందించి ఓట్లు అభ్యర్థిస్తున్న ఉపసర్పంచ్ ముదుండి సూర్యనారాయణరాజు, నాయకులు

భీమడోలు: ప్రజాసంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల మ్యానిఫెస్టోను ప్రకటించారని, మహిళా సాధికారతకు పెద్ద పీట వేశారని ఉపసర్పంచ్ ముదుండి సూర్యనారాయణరాజు అన్నారు. గుండుగొలనులోని తాత చెరువు, పంచాయతీ, శివాలయం తదితర ఏరియాల్లో మంగళవారం రాత్రి గ్రామ పార్టీ అధ్యక్షుడు ముదుండి సూర్యనారాయణరాజు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు, ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్ యాదవ్‌ను గెలిపించాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఇంటింటి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి ఎమ్మెల్యే అభ్యర్థి పుప్పాల వాసుబాబు, ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్‌యాదవ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు జనసేన నుంచి వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు నంద్యాల సుబ్బరాజు, రాష్ట్ర వైఎస్సార్‌సీపీ జాయింట్ కార్యదర్శి వగ్వాల అచ్యుతరామారావు, నాయకులు దోకల మురళీ, గొటికల మురళీ, నల్ల శంకర్, నల్ల శ్రీనివాసరావు, జహీర్, వగ్వాల రామన్, నాగబోయిన కృష్ణ, నత్తా నరసింహులు, మహిళలు పాల్గొన్నారు.

**మహిళా సాధికారతే లక్ష్యంగా ఎన్నికల మేనిఫెస్టో**

భీమడోలు: వైఎస్సార్‌సీపీ మహిళా సాధికారతే లక్ష్యంగా సంక్షేమ పథకాలు అమలు చేసి మహిళల్లో ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించిందని భీమడోలు జెడ్పీటీసీ తుమ్మగుంట భవాని అన్నారు. చెట్టున్నపాడు పంచాయతీ పరిధిలో మల్లవరంలో మంగళవారం రాత్రి మండలంలోని మండల, గ్రామస్థాయి మహిళా ప్రజాప్రతినిధులు ఉంగుటూరు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పుప్పాల వాసుబాబు, ఎంపీ కారుమూరి సునీల్ యాదవ్‌ను గెలిపించాలని కోరుతూ ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం చేశారు. జగనన్న ప్రకటించిన ఎన్నికల మేనిఫెస్టోలో మహిళలకు వరాల జల్లు కురిపించారని వారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఇంజేటి నీలిమ, చెట్టున్నపాడు సర్పంచ్ జల్లూరి వెంకటనరసమ్మ, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ భలే నాగలక్ష్మి మండల సర్పంచుల ఛాంబర్ అధ్యక్షురాలు పాము సునీత, సర్పంచులు దాయం సుజాత ప్రసాద్, గుడివాడ నాగగౌతమి సీతారామాంజనేయులు, ఎంపీటీసీలు వనమాల సుజాత, అంబటి దేవి,మండల మహిళా విభాగం కన్వీనర్ పత్తివాడ ప్రసన్న, వార్డు సభ్యుడు లావేటి పార్వతి, మహిళలు పాల్గొన్నారు.


బువ్వనపల్లిలో వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టోను వివరిస్తున్న వైఎస్సార్ సీపీ మహిళా నేతలు


మల్లవరంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న జెడ్పీటీసీ, ఏఎంసీ చైర్మన్ తదితరులు


ఉంగుటూరులో ప్రచారం చేస్తున్న ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, నాయకులు,కార్యకర్తలు

**టీడీపీ నాయకుల మాటలు నమ్మవద్దు**

ఉంగుటూరు: టీడీపీ నాయకుల మాటలు నమ్మి మోసపోవద్దని ఉంగుటూరు ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి అన్నారు. మంగళవారం ఉంగుటూరులో కాలువ అవతల పేట, మునసబు గారి చెరువు చుట్టుపక్కల ప్రాంతాల్లో వైఎస్సార్ సీపీ నాయకులు ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ శ్రీలక్ష్మి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీకి రెండు ఓట్లు ఫ్యాను గుర్తుపై వేసి ఎమ్మెల్యేగా వాసుబాబును, ఎంపీగా కారుమూరి సునీల్‌యాదవ్‌ను గెలిపించాలని కోరారు. ఎంపీటీసీ సభ్యుడు పెనుగొండ బాలకృష్ణ, సందక రాంబాబు, చల్లాలమ్మ ట్రస్టీ బోర్డు మాజీ చైర్మన్ దూసనపూడి లక్ష్మీనారాయణ, నాయకులు ముప్పన సత్యనారాయణ, ఎడ్లపల్లి వెంకట్రావు, కొల్లి నాగు, వుయ్యూరి సతీష్ , గేదల సన్యాసిరావు, లచ్చిరెడ్డి లచ్చయ్య పాల్గొన్నారు.

**గ్రామాల్లో సందడిగా ఇంటింటి ప్రచారం**

నిడమర్రు: వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పుప్పాల వాసుబాబుకు మద్దతుగా పలు గ్రామాల్లో పార్టీ శ్రేణులు ప్రచారం నిర్వహిస్తున్నారు. మంగళవారం బువ్వనపల్లిలో పుప్పాల కన్నబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో ఆయన సతీమణి ప్రవీణ గడపగడపకు వెళ్లి మహిళలకు కుంకమ బొట్టు పెట్టి ఎమ్మెల్యే అభ్యర్థి వాసుబాబును, ఎంపీ అభ్యర్థి సునీల్‌కు ఓటు వేసి భారీ మెజార్టీ అందించాలని కోరారు. ఎంపీపీ ధనుకొండ ఆదిలక్ష్మి, సర్పంచ్ కిలారి రవిసత్యవతి, ఉపసర్పంచ్ వెల్లంకి నరేష్, వైస్ ఎంపీపీ సమయం వీర రాఘవులు, మండల పార్టీ అధ్యక్షుడు సంకు సత్యకుమార్, గ్రామఅధ్యక్షుడు కాన్వెంట్ శ్రీను పాల్గొన్నారు.

# వైఎస్సార్‌సీపీ విజయానికి బీసీలంతా కృషి చేయాలి

రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య


ఏలూరులో రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్యను కలిసిన నౌడు వెంకట రమణ, నాయకులు

భీమడోలు: వైఎస్సార్‌సీపీ విజయఢంకా మోగించేందుకు బీసీలంతా యుద్ధ సైనికుల్లా పని చేయాలని రాజ్యసభ సభ్యుడు, బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. ఏలూరులోని ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్‌యాదవ్ ఇంటి వద్ద మంగళవారం నిర్వహించిన సమావేశానికి హాజరైన ఆర్.కృష్ణయ్యను బీసీ రాష్ట్ర బీసీ సంఘాల గౌరవ అధ్యక్షుడు, రాష్ట్ర వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి నౌడు వెంకటరమణ ఆధ్వర్యంలో జిల్లా, మండల నాయకులు కలిసి తమ సంఘీభావం తెలిపారు. బీసీ చైతన్య సంఘం జిల్లా అధ్యక్షుడు పాకిన సత్యనారాయణ, మండల మాజీ కన్వీనర్ చిలపర్తి రామారాయుడు, నాయకులు కిలపర్తి రుగ్మాంగధరరావు, చీర విష్ణు కలిసారు. ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు, ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్ యాదవ్ విజయానికి సంబంధించి బీసీ నాయకులతో ఆర్.కృష్ణయ్య చర్చించారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత బీసీలకు సామాజిక సాధికారత లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి 50 శాతానికి పైగా పదవులను అందించారన్నారు. రాష్ట్ర చరిత్రలో 50 శాతం సీట్లను బీసీలకు ఎమ్మెల్యే, ఎంపీ స్థానాలను కేటాయించారన్నారు. సీఎం జగనన్న బీసీలను అన్ని విధాలుగా ఆదుకుంటున్నారన్నారు. చంద్రబాబు కూటమికి స్వార్థపూరిత రాజకీయాలు చేస్తున్నారని అన్నారు. వారిని ఓడించేందుకు బీసీలంతా కంకణబద్ధులు కావాలని కోరారు. ఉంగుటూరు నియోజకవర్గంలోని బీసీలందరినీ ఐక్యం చేసి వాసుబాబు, సునీల్‌యాదవ్‌ను గెలిపించాలన్నారు.

# వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై దాడి

బాధితుడికి తీవ్ర గాయాలు, కేసు నమోదు

దెందులూరు: గంగన్నగూడెంలో సోమవారం రాత్రి దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఎన్నికల ప్రచారం అనంతరం జరిగిన ఘటనలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త పెదవేగి మండలం పెదకడిమికి చెందిన సిరివరపు రాజేష్‌పై దాడి జరిగిందని దెందులూరు ఎస్సై కే స్వామి తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. సోమవారం రాత్రి గంగన్నగూడెంలో ఎన్నికల ప్రచారం ముగించుకుని వస్తుండగా ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరిని గ్రామస్తులు, అభిమానులు ఆపి ఘనంగా సత్కరించారు. ఈ సమయంలో మెయిన్ రోడ్డుపై ట్రాఫిక్ నిలిచిపోయింది. దీంతో రాజేష్‌తోపాటు మరికొంత మంది ట్రాఫిక్ క్లియర్ చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు. మొండూరు గ్రామానికి చెందిన ఆలపాటి బన్ను వారిని దూషించి జెండా కర్రతో రాజేష్‌ను కొట్టి గాయపర్చాడు. గాయపడిన రాజేష్‌ను ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. ఈ ఘటన వివరాలను పెదవేగి సీఐ శ్రీనివాసకుమార్‌కు తెలియజేసినట్టు ఎస్సై పేర్కొన్నారు.

# లబ్ధిదారుడి బ్యాంక్ ఖాతాకు పింఛను సొమ్ము

దెందులూరు: దెందులూరు మండలంలో మే నెల సామాజిక పింఛన్ కోసం ఏ ఒక్కరూ గ్రామాల్లోని సచివాలయాలకు రావద్దని దెందులూరు ఎంపీడీఓ వీ.శ్రీలత కోరారు. మంగళవారం దెందులూరు ఎంపీడీఓ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పింఛన్‌దారుడి ఆధార్ కార్డు అనుసంధానమైన బ్యాంకు ఖాతాకు నేరుగా డీబీటీ ద్వారా 1వ తేదీన సొమ్ము జమ చేయనున్నట్టు తెలిపారు. డీబీటీ ద్వారా పింఛను జమ కాని లబ్ధిదారుల ఇంటికి వచ్చి పెన్షన్ నగదు అందిస్తామన్నారు.

# కొల్లేరు అభివృద్ధిని చూసి ఓటు వేయండి

కొఠారు అబ్బయ్యచౌదరి ఎన్నికల ప్రచారం


కలకుర్రులో రూ.10 లక్షలతో నిర్మించిన జంబో షెడ్డు వద్ద కొఠారు అబ్బయ్యచౌదరి,నాయకులు


రామచంద్రపురంలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ అభ్యర్థి అబ్బయ్యచౌదరి సోదరీమణులు

ఏలూరు రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమం చూసి ఓటు వేయాలని దెందులూరు నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. మంగళవారం ఏలూరు రూరల్ మండలం సోమవారం ఏలూరు రూరల్ మండలం కోమటిలంక, పెదయాగనమిల్లి, కలకుర్రు, శ్రీపర్రులో వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల పాటు సంక్షేమ పథకాలతో జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల మనస్సుల్లో కొలువయ్యారని అన్నారు. టీడీపీ, జనసేన నాయకులు అధికారమే పరమావధిగా భావించి కూటమిగా ఏర్పడ్డారన్నారు. ఈ ఎన్నికల్లో వారికి సరైన గుణపాఠం ప్రజలే చెబుతారని అన్నారు. ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు, జెడ్పీటీసీ మండల సరస్వతి, సీనియర్ నాయకుడు పీవీరావు, వడ్డి కార్పొరేషన్ చైర్మన్ ముంగర సంజీవ్‌కుమార్, డైరక్టర్ మండల కొండలరావు, తేరా ఆనంద్, సర్పంచ్‌లు సైదు భాగ్యలక్ష్మీ, బలే నాగసులోచన, తెనాలి యోహాన్, బలే నాగప్రసాద్, ఎంపీటీసీలు బలే స్వాతి, శైలజ పాల్గొన్నారు.

**జాలిపూడిలో నాయకులు ప్రచారం:** ఏలూరు రూరల్ మండల గ్రామం జాలిపూడిలో మంగళవారం వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రచారం చేశారు. పార్టీ గ్రామ అధ్యక్షుడు మధ్యాహ్నపు వాసు, ఎంపీటీసీల కాకర్ల తంబి, కోడిమక్కల నాగేషు, కార్యకర్తలు నాయకులు వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టో కరపత్రాలు ప్రజలకు అందించి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి కొఠారు అబ్బయ్యచౌదరిని గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు.

**వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించండి**

పెదవేగి : వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ రామచంద్రపురంలోని ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పెదవేగి మండలం రామచంద్రపురంలో మంగళవారం వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి సోదరీమణులు వెంకటలక్ష్మి, శ్రీవల్లి ఇంటింటికీ వెళ్లి కొఠారు అబ్బయ్యచౌదరిని గెలిపించమని కోరారు. ఫ్యాన్ గుర్తుకు రెండు ఓట్లు వేసి మద్దతుగా నిలవాలని అభ్యర్థించారు. మహిళలకు అధిక ప్రాధాన్యతనిస్తూ రాజకీయ అవకాశాలు కల్పించిన జగనన్నకు అండగా నిలవాలని కోరారు. మహిళల స్వావలంబనకు నవరత్న పథకాలు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిందని వారు గుర్తు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభ్యర్థి కొఠారు అబ్బయ్య చౌదరిని, ఏలూరు పార్లమెంట్ అభ్యర్థి కారుమూరి సునీల్ కుమార్‌ను గెలిపించాలని ఓట్లు అభ్యర్థించారు.

# తాగునీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు

భీమడోలు: వేసవి దృష్ట్యా తాగునీటి ఎద్దడి తలెత్తకుండా తగు చర్యలు చేపట్టామని భీమడోలు ఎంపీపీ కనమాల రామయ్య అన్నారు. భీమడోలులో మంగళవారం సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అనుసరిస్తూ మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ కనమాల రామయ్య అధ్యక్షతన వహించారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని గతంలోనే తాగునీటి సమస్య పరిష్కారానికి సమ్మర్ యాక్షన్ ప్రణాళికను సిద్ధం చేశామన్నారు. కొల్లేరు గ్రామాలైన ఆగడాలలంక, చెట్టున్నపాడులో నీటి సమస్యలు రాకుండా చూడాలన్నారు. సమస్య తలెత్తితే ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేయాలని కోరారు. ఎంపీడీవో టి.స్వర్ణలత మాట్లాడుతూ మండలంలో 9,123 మంది పింఛన్ లబ్దిదారులుగా వారిలో 7వేల మందికి ఆధార్‌తో బ్యాంకు ఖాతాకు అనుసంధానమైందన్నారు. దీని వల్ల వారికి ఖాతాలకు పింఛన్ నగదును జమ చేస్తామన్నారు. మిగిలిన 2,123 మందికి నగదును వారి ఇళ్ల వద్దకే సిబ్బంది తీసుకుని వెళ్లి అందిస్తారన్నారు. పింఛన్‌దారులు సచివాలయాలకు రావనసరం లేదన్నారు. మే 1 నుంచి 5వ తేదీ వరకు పింఛన్లు పంపిణీ చేస్తామన్నారు. జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగ, ఏఎంసీ చైర్మన్ ఇంజేటి నీలిమజూనియర్, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

### వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టోపై హర్షం


పోలసానిపల్లి వద్ద అంబేద్కర్ ఫ్లెక్సీ వద్ద హర్షం వ్యక్తం చేస్తున్న అంబటి నాగేంద్రప్రసాద్, యువకులు

భీమడోలు: దళితుల్లో ఆత్మాభిమానం పెంచేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల మేనిఫెస్టోను ప్రకటించారని జిల్లా ఎస్సీ సెల్ జాయింట్ కార్యదర్శి, మాజీ ఉప సర్పంచ్ అంబటి నాగేంద్ర ప్రసాద్ అన్నారు. వైఎస్సార్ సీపీ మేనిఫెస్టోలో 500 మంది జనాభా గల దళిత వాడలను ప్రత్యేక పంచాయతీలుగా గుర్తిస్తామని ప్రకటించడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. పోలసానిపల్లిలోని అంబటి నాగేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ ఫ్లెక్సీ వద్ద సమావేశం నిర్వహించారు. ఐదేళ్లుగా ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల ప్రజలు వాసుబాబును గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో దళిత యువకులు పాల్గొన్నారు.